నిలిచిన 'అంగన్‌వాడీ' నిర్మాణాలు

- ఏడు అంగన్‌వాడీ భవనాలకు నిధులు మంజూరు
- ఒక్కో భవనానికి రూ.12లక్షలు కేటాయింపు
- ఏడాది క్రితం పనులు ప్రారంభమైనా నేటికీ పూర్తిగాని వైనం
- అద్దె భవనాల్లో ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, చిన్నారులు


ఆర్లెగూడెంలో స్లాబ్ దశలో నిలిచిన అంగన్‌వాడీ భవనం నిర్మాణం

చిలుకూరు : మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. ఆ గదుల్లో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతో ప్రభుత్వం నూతన అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి దాదాపుగా ఏడాది కావస్తున్నా నేటి వరకు నూతన భవనాల నిర్మాణాలు పూర్తి కాలేదు. బిల్లులు సమయానికి మంజూరు కావడం లేదనే సాకుతో సంబంధిత కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం, అలాగే గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు లేకపోవడంతో కూడా పనులు పూర్తి స్థాయిలో ముందుకు సాగడం లేదని తెలుస్తుంది. మండల పరిధిలో 40అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటిల్లో 18 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన కేంద్రాలు గ్రామాల్లోని పాఠశాలల్లో, మరికొన్ని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు.

ఒక్కో భవనానికి రూ.12లక్షలు మంజూరు..

మండలంలో ఏడు అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. వాటిలో రామాపురంలో 2, ఆర్లెగూడెంలో 2, కొండాపురం, చిలుకూరు, రామ్‌చంద్రానగర్ గ్రామంలో ఒకటి చొప్పున మొత్తం ఏడు నూతన అంగన్‌వాడీ భవనాలకు ఒక్కొ భవనానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.8లక్షలు, 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.2లక్షలు, ఉమెన్ చైల్డ్ డెవలప్‌మెంట్ నిధులు రూ.2లక్షలు చొప్పున రూ.12లక్షలు మంజూరయ్యాయి. వాటిల్లో ఆర్లెగూడెంలో 2 భవనాలు స్లాబ్ దశలో ఉన్నాయి. రామ్‌చంద్రానగర్ గ్రామంలో ఎర్త్‌వర్క్ పనులు జరుగుతున్నాయి. మరో 4 నూతన భవన నిర్మాణ పనులు నేటి వరకు ప్రారంభం కాలేదు. మండల పరిధిలోని సీత్లాతండాలో గతంలో మంజూరైన నిధులతో భవనం నిర్మించారు. కాని నిధులు సరిపోకపోవడంతో భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో అద్దె భవనాల్లో, పాఠశాలల ఇరుకు గదుల్లో చిన్నారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే నూతన భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి చిన్నారుల ఇబ్బందులు తొలగించాలని అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పనులు వేగవంతంగా జరిగేలా చూస్తాం

మండలంలో నూతన అంగన్‌వాడీ భవనాలు ఏడు మంజూరయ్యాయి. వాటిల్లో మూడు భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మరో నాలుగు భవనాలు ప్రారంభం కాలేదు. తక్షణమే భవన నిర్మాణ పనులు జరిగేలా చూస్తాం. మరో 5నెలల్లో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం.
– సాయిరాం, పీఆర్ఏఈ, చిలుకూరు

యూరియా, కాంప్లెక్స్ ఎరువుల కొరత లేదు


ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ రవి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ డివిజన్‌లో యూరియా, కాంప్లెక్స్ ఎరువులకు కొరత లేదని ఏడీఏ రవి తెలిపారు. గురువారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు, నిలవ్వలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆయకట్టు పరిధిలో సాగుకు ఇంకా సమయం ఉన్నందున రైతులు యూరియా, కాంప్లెక్స్ ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు అవసరమైన యూరియా, కాంప్లెక్స్ ఎరువులను పీఏసీఎస్‌ల ద్వారా ఇతర ప్రైవేటు దుకాణాల ద్వారా అందించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎవరైనా వ్యాపారులు యూరియా, కాంప్లెక్స్ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే వారి లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు.

బీసీ రిజర్వేషన్లు 42శాతం పెంచాలి


పానుగోటి రంగా

మునగాల : కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్లను 42శాతం పెంచాలని, అందుకు తగిన సమయం ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పానుగోటి రంగా డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం హైకోర్టు ఇచ్చిన గడువులోగా 2025సెప్టెంబర్ 30లోపు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును తాము స్వాగతిస్తున్నామని, ఈ తీర్పు బీసీ రిజర్వేషన్ల పెంపునకు ఎటువంటి అడ్డంకి కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ అంశంపై చర్యలు తీసుకునేందుకు తగిన సమయం లభించిందన్నారు. రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని, కేంద్రంపై నెట్టి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బీసీల విషయంలో రాజకీయాలు చేయకుండా వెంటనే రిజర్వేషన్ల పెంపుపై కార్యాచరణ ప్రారంభించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

నేడు మంత్రి ఉత్తమ్ పర్యటన

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయా మండలాల్లోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు, రేపు బస్‌పాస్ మేళా

హుజూర్‌నగర్ : పట్టణంలోని పాత బస్టాండ్‌లో శుక్ర, శనివారాల్లో బస్‌పాస్ మేళా (క్యాంప్) నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు గురువారం తెలిపారు. బస్‌పాస్ కావాల్సిన దివ్యాంగులు సదరన్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో పాటు పాస్‌ఫొటో వెంట తెచ్చుకోవాలన్నారు. పట్టణ, పరిసర ప్రాంతాలలో ఉన్న విద్యార్థులు, దివ్యాంగులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కేజీబీవీలో స్వీపర్‌పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గరిడేపల్లి : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న స్వీపర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ చత్రునాయక్ గురువారం తెలిపారు. ఏడో తరగతి ఉత్తీర్ణులై ఉండి 18నుంచి 40 సంవత్సరాలు కలిగిన స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వనున్నామన్నారు. అర్హత కలిగిన వారు దరఖాస్తు ఫారం, ఏడో తరతగి మార్కులు మెమో, టీసీ, ఆధార్‌కార్డు, రెసిడెన్షియల్, నివాస సర్టిఫికెట్ తీసుకొని ఈ నెల 14వతేదీ వరకు కేజీబీవీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్‌కు దరఖాస్తు అందజేయాలని అన్నారు.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలోని ఆర్యవైశ్య పేద, మెరిట్ విద్యార్థులకు ప్రతి ఏటా అందజేసే ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) స్కాలర్ షిప్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వంగవేటి సతీష్‌కుమార్, పెనుగొండ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆగస్టు 10వతేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు పట్టణంలోని శ్రీసాయి సంతోషి ఏజెన్సీస్‌లో లభిస్తాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కందిబండ వాసికి డాక్టరేట్


పత్తిపాటి వెంకటేశ్వర్లు

మేళ్లచెరువు : మండలంలోని కందిబండ గ్రామానికి చెందిన పత్తిపాటి వెంకటేశ్వర్లుకు కాకతీయ యునివర్సిటీ గురువారం డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ స్టడీ ఆన్‌ది అవేర్‌నెస్ అండ్ చాలెంజస్ ఇన్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఆర్‌టీఈ -2009 యాక్ట్ అమాంగ్ ది టీచర్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్దాంత గ్రంధానికి డాక్టరేట్ లభించినట్లు పేర్కొన్నారు. ఆయనను గ్రామస్తులు అభినందించారు.

సీసీ కెమెరాల అందజేత


హెచ్‌ఎంకు సీసీ కెమెరాలు అందజేస్తున్న ట్రస్టు చైర్మన్ మధునాబేగం

చిలుకూరు : మండలంలోని జెర్రిపోతులగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు గురువారం గ్రామానికి చెందిన మౌలానా మౌబిబి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ మధునాబేగం నాలుగు సీసీ కెమెరాలను బహూకరించారు. ఈ కెమెరాలను పాఠశాల హెచ్‌ఎం సైదయ్యకు అందజేశారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. సీసీ కెమెరాలు వంద కళ్లతో సమానమని అన్నారు. ఈ సందర్భంగా దాతను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రెడ్డిమల్ల వెంకటేశ్వర్లు, పీఎస్ పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు, గ్రామపెద్దలు రాంశెట్టి కోటయ్య, పాఠశాల చైర్మన్ సాగరిక, అంగన్‌వాడీ టీచర్ నిర్మల, గౌసియా బేగం, జానిపాషా, మురళీ, నాగరాజు, నవీన్, జమాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరి అదృశ్యం

కోదాడరూరల్: గొర్రెల వద్ద కాపలాగా ఉన్న వ్యక్తి కనిపించకుండా పోయాడు. ఈ ఘటన కోదాడ మండల పరిధిలోని కూచిపూడితండా శివారులో ఈ నెల 5న జరగగా.. గురువారం వెలుగులోకి వచ్చింది. కోదాడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా ధన్వాడ మండలం యమ్మనపల్లికి చెందిన బోయ రాములు, మరికొందరు కలిసి గొర్రెలు మేపుకుంటూ సంచార జీవనం సాగిస్తున్నారు ఈ క్రమంలో ఐదు రోజులు కిందట కోదాడ మండలం కూచిపూడితండా గ్రామ శివారులో గొర్రెల మందను దొడ్డిలో ఉంచి రాములును కాపలాగా పెట్టి మిగతా వారు నిద్రించారు. అర్ధరాత్రి 12గంటల సమయంలో లేచి చూసేసరికి రాములు కనిపించకుండా పోయాడు. వారు చుట్టుపక్కల ఎంత వెతికినా రాములు ఆచూకీ లభించలేదు. దీంతో రాములు కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చి గ్రామానికి ఏమైనా వచ్చాడా అని ఆరా తీయగా రాలేదని చెప్పారు. ఐదు రోజులు పాటు బంధువులు, తెలిసిన ప్రాంతాల్లో వెతికినా అతడి ఆచూకీ లభించకపోవడంతో రాములు సోదరుడి కుమారుడు బీరప్ప గురువారం కోదాడ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమాజంలో గురువుల స్థానం ఉన్నతమైనది


రిటైర్డ్ ఎంఈఓ, ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పెన్షనర్లు, బీజేపీ నాయకులు

హుజూర్‌నగర్ : సమాజంలో గురువుకు ఉన్న స్థానం ఎంతో ఉన్నతమైనదని పలువురు ప్రభుత్వ పెన్షనర్లు, బీజేపీ నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయంలో బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎంఈఓ ఎంబి దేవదానం, రిటైర్డ్ జీహెచ్‌ఎం, కేవీఎస్ మూర్తి, రిటైర్డ్ ఉపాధ్యాయులు పులిపాటి నరసయ్య, ఎండీ మోహినుద్దీన్, పాలిశెట్టి మోహన్‌రావు, బెల్లంకొండ రామలక్ష్మిని శాలువాలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. సమాజంలో గురువుకు ఉన్న స్థానం ఎనలేనిదని, తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుది అంటే వారికి ఉన్న విలువను అర్థం చేసుకోవచ్చని తెలిపారు. అటువంటి గురువులను ఎల్లవేళలా గౌరవించుకోవాలన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ కార్యదర్శి కొప్పుల వీరారెడ్డి, సంఘం నాయకులు ఎంఎస్ఎన్ రాజు, చంద్రశేఖర్, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మయ్య, చంద్రయ్య, పీఎల్ఎస్ రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షులు హరీష్, నాయకులు ఉమామహేశ్వరరావు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలి


నడిగూడెం : మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి


గరిడేపల్లి : మాట్లాడుతున్న ఎంఈఓ చత్రునాయక్

నడిగూడెం : ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలని సెక్టోరియల్ అధికారి జనార్దన్ అనానరు. గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మండల విద్యాధికారి బి.ఉపేందర్‌రావు మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతుల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలన్నారు. సమావేశంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో గురువారం ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ చత్రునాయక్ మాట్లాడారు. ఎఫ్ఎల్ఎన్, ఎఫ్ఆర్ఎస్, ఏకరూప దుస్తులు ఆన్‌లైన్, న్యూఅడ్మిషన్స్, ఎండీఎం యాప్ గురించి పాఠశాల వారీగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఎం.సువర్ణ, నాగమణి, పాఠశాలల హెచ్‌ఎంలు బాలసైదిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజారావు, సైదిరెడ్డి, పాపయ్య, సీఆర్పీలు రామకృష్ణ, అశోక్‌కుమార్, వెంకటేశ్వర్లు, ఉమా, కోటయ్య ఉన్నారు.

పెరిగిన ఆలయ భూముల కౌలు ఆదాయం


వేలంలో పాల్గొన్న చైర్మన్, తదితరులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని తొగర్రాయిలో గల వేణుగోపాలస్వామి ఆలయ భూముల కౌలుకు వేలం నిర్వహించారు. గత ఏడాది కంటే ఈ సారి ఎక్కువగా రూ.2.28లక్షలకు పెంచి రైతులు దక్కించుకున్నారు. గురువారం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో వేర్వేరుగా ఉన్న 20ఎకరాల భూముల వేలంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొని ఎక్కువ రేటుకు వేలం పాడారు. గత ఏడాది 20ఎకరాలకు రూ.3లక్షల75వేలు రాగా, ఈ ఏడాది అదే భూములకు రూ.6లక్షల 3వేలకు దక్కించుకున్నారు. ఇక 3ఎకరాల 30గుంటల భూమిని రూ.80వేలకు జడ వెంకటేశం, 5ఎకరాలను పులి సులోచనరావు రూ.1.88లక్షలకు, 10.8గుంటల భూమిని చిల్లా లింగయ్య రూ.3లక్షల 22వేలకు, 1.30గుంటలను రూ.13వేలకు దక్కించుకున్నారు. వేలంలో భూములు దక్కించుకున్నవారు ఇచ్చిన గడువులో నగదు చెల్లించాలని, లేనిపక్షంలో తిరిగి వేలం వేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అమరనాయిని వెంకటేశ్వరరావు, జిల్లా దేవాదాయ సహాయ కమిషనర్ కోదాటి భాస్కర్, ఈఓ వెంకటచలపతి, అర్చకులు నందుల లక్ష్మీనరసింహశాస్త్రి, రైతులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


శిబిరంలో పాల్గొన్న వైద్యసిబ్బంది

మునగాల : గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని మండలంలోని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టీబీ నోడల్ పర్సన్ లింగం రామకృష్ణ సూచించారు. గురువారం మండలంలోని నర్సింహులగూడెంలో రేపాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిక్షయ్ శివిర్ క్షయవ్యాధి నిర్ధారణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్షయవ్యాధి సోకిన ఆరునెలల పాటు మందులు వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు. ఈ శిబిరంలో 106మందికి పరీక్షలు నిర్వహించామన్నారు. శిబిరంలో టీబీ సూపర్‌వైజర్ సుభాషిణి, జిల్లా టీబీ కోఆర్డినేటర్ బడుగు ప్రసాద్, డీఈఓ మాధవరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ ఫణీందర్, గ్రామపంచాయతీ సెక్రటరీ ఉదయ్‌కుమార్, ఆశావర్కర్లు రమణ, జ్యోతి, లక్ష్మీ, సుధారాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

శివాలయం ఈఓగా శంభిరెడ్డి


బాధ్యతలు చేపడుతున్న నాగేళ్ల శంభిరెడ్డి

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయం ఈఓగా నాగేళ్ల శంభిరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో రెనివేషన్ కమిటీ చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, గోవిందరెడ్డి, నర్సింహరావు, చందర్‌రావు, నాగిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, అర్చకులు శివవిష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

మండల కేంద్రంలోని శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో గురువారం ఫారెస్టు జిల్లా అధికారి సతీష్‌కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అభిషేకాలు నిర్వహించి స్వామి వారి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం స్వామివారి శేషవస్త్రం, పూలమాలతో వారిని సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు


మునగాల : వేడుకల్లో పాల్గొన్న భక్తులు


కోదాడరూరల్ : నల్లబండగూడెంలో పూజలు చేస్తున్న భక్తులు, నిర్వాహకులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని నల్లబండగూడెం శివారులో గల సాయిమందిరంలో గురుపౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 7వేల మంది భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, పీసీసీ సభ్యుడు లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ఆలయ చైర్మన్ నల్లపాటి నరసింహారావు, మాజీ ఎంపీపీలు చింతా కవితారాధారెడ్డి, మల్లెల రాణిబ్రహ్మయ్య, తూమాటి వరప్రసాద్‌రెడ్డి, ముండ్రా రంగారావు, ఏదులాపురం శ్రీను, శరబేశ్వరరావు, రామచందర్‌రావు, ఆదినారాయణ, భక్తులు ఉన్నారు.

ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు

హుజూర్‌నగర్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాలస్వామి వారి దేవాలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీఅనంత పద్మనాభ స్వామి విగ్రహానికి పంచామృత అభిషేకం, పట్టువస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొత్త ప్రవీణ్‌కుమార్, అపర్ణ, వై.రామస్వామి, కె.గోపాల్, వి.హరీష్, ఎం.పురుషోత్తంరెడ్డి, వి.జగన్మోహన్‌రెడ్డి, పి.వెంకటరెడ్డి, కే.వెంకటేశ్వరరావు, ఉదయశ్రీ, ఆలయ అర్చకులు, ఈఓ, పాలకమండలి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో..

పట్టణంలోని సాయిబాబా మందిరంలో గురువారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాకు పంచామృత అభిషేకం, విశేషాలంకరణ, ప్రత్యేక పూజలను అర్చకులు జానకిరామశర్మ చేశారు. అనంతరం ప్రవచనకర్త దుర్గాప్రసాద్‌ని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వి.నాగేశ్వరరావు, టి.శేఖర్, ఆకుల రాము, స్థానికులు కె.రామ్మోహన్‌రావు, జి.ప్రభాకర్, వి.వెంకయ్య, కె.శ్రీనివాసరావు, టి.సైదారత్నం, ఎస్.సీతారామయ్య, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, నరసింహారావు, సుశీల, రాజ్యలక్ష్మి, రజిని, పద్మావతి, వెంకటలక్ష్మి భక్తులు పాల్గొన్నారు.

మునగాల : మండల కేంద్రంలో గల శ్రీహరిహర సుత అయ్యప్ప దేవాలయం ఆవరణలో గల శ్రీషిరిడి సాయిమందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను మందిరం నిర్వాహకులు దేవినేని రవికుమార్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా సాయిమందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు దేవినేని సీతారామయ్య -మాధవి దంపతులు, కుటుంబ సభ్యులు 100మంది వృద్ధ మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. వేడుకల్లో ఆర్.వంశీధరస్వామి, సిద్దోజు వెంకటేశ్వరచార్యులు, వారణాసి బుచ్చిరామయ్య శాస్త్రి, గ్రామ పెద్దలు నల్లపాటి శ్రీనివాస్, వంగవేటి వెంకటగురుమూర్తి, శాఖమూడి అప్పారావు, తడకమళ్ల శ్రీనివాసాచారి, కాసర్ల బోస్, వెంకట్ పాల్గొన్నారు.

చిలుకూరు : మండల వ్యాప్తంగా గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొడారు వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సాయిమందిరాల్లో భక్తుల ప్రత్యేక పూజలు

నేరేడుచర్ల : పట్టణం, మండలంలోని సాయి మందిరాలకు గురువారం గురుపౌర్ణమి సందర్భంగా తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మున్సిపాలిటీలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయ ప్రాంగణంలో గల సాయి మందిరంలో వేద పండితులు ఉగ్రదని శివప్రసాదశర్మ, రవికుమార్‌శర్మల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా శివధాన్యం ఆఫీస్ యాజమాని గుండా సత్యనారాయణ-పద్మావతి, రాచకొండ శ్రీనివాస్‌రావు-పావని దంపతులు స్వామివారికి నూతన పట్టువస్త్రాలతో పాటు పూలదండలు, మండప అలంకరణ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రామకోటేశ్వర్‌రావు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గల ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ మాత దేవాలయంలో గురువారం సత్రకమిటీ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మట్టపల్లి దేవాలయ వంశపారంపర్య అర్చకుడు తూమాటి క్రిష్ణమాచార్యులును శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సత్రకమిటీ కార్యదర్శి గెల్లి విద్యాసాగర్, ఉపాధ్యక్షులు ఓరుగంటి నరసింహారావు, పాలిశెట్టి లక్ష్మీనరసింహారావు, ఈగా కోటేశ్వరరావు, రాయపూడి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయి మందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ అర్వపల్లి శంకర్, నడిగూడెంకు చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం పందిరి వెంకటరెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం పసుపులేటి భిక్షంను ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రేపాల పురుషోత్తం, కార్యదర్శి ఎంవి.రమణ, బుస్సా మహేష్, ఆలయ అర్చకులు రాజశేఖర్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలను గురువారం భక్తులు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గురూజీ జుత్తిగ రవికుమార్ ఆధ్వర్యంలో సాయి సత్సంగం పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అనంతరం బాబాను ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో వేలాది మంది భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


గరిడేపల్లి : సాయిబాబా ఆలయంలో..


హుజూర్‌నగర్ : శ్రీఅనంత పద్మనాభ స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు ఈఓ, పాలకమండలి


చిలుకూరులో ..


నడిగూడెం : శ్రీషిర్డీసాయి మందిరంలో అభిషేకం చేస్తున్న భక్తులు


నేరేడుచర్ల : సాయినాథుడి మందిరంలో..


మఠంపల్లి : మట్టపల్లిలో అర్చకుడు క్రిష్ణమాచార్యులును సన్మానిస్తున్న సభ్యులు

సంక్షిప్త సమాచారం

ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు

పాలకవీడు : మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో గల శివాలయం అభివృద్ధికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో రూ.50లక్షలు మంజూరైనట్లు మాజీ జెడ్పీటీసీ మాళోతు బుజ్జిమోతీలాల్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

బోరును తొలగించాలి

మఠంపల్లి : మండలంలోని భీల్యానాయక్‌తండాలో గల ప్రభుత్వ పాఠశాల స్థలంలో కొంత మంది అక్రమంగా ఏర్పాటు చేసిన బోరును అధికారులు వెంటనే తొలగించాలని గిరిజన మోర్చా మండల నాయకుడు బానోతు రంగానాయక్ కోరారు. గురువారం బోరును పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట బీజేపీ మండల ఉపాధ్యక్షుడు బానోతు బాలునాయక్, ఆదినారాయణయాదవ్, ఆరాల సైదులు, ధరావత్ నాగానాయక్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

గరిడేపల్లి : సీఎం సహాయ నిధి పేదలకు వరంలాంటిదని మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడు షేక్ చాంద్‌మియా అన్నారు. గురువారం మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.2లక్షల 80వేల చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎల్లావుల గంగ, శైలజ, పిడమర్తి నాగరాజు, మంజుల, వెంకన్న, సతీష్, సైదులు, సోమయ్య ఉన్నారు.

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన ఎస్‌కే జానిమియాకు మంజూరైన రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గురువారం స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయంలో టీపీసీసీ జాయింట్ సెక్రటరీ అజీజ్ పాషా, ఎస్.సుబ్బరాజు అందజేశారు.

ఫొటోగ్రాఫర్లకు ప్రభుత్వం చేయూత ఇవ్వాలి

కోదాడరూరల్ : ఆపదలో ఉన్న ఫొటోగ్రాఫర్లను ఆదుకునేందుకు ప్రభుత్వం చేయూత ఇవ్వాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కూకుంట్ల లాలు అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల ఫొటోగ్రాఫర్‌లు శ్యామల సైదులు, పులి సైదులు, రాజేష్‌కు సంఘం ఆధ్వర్యంలో కుటుంబ భరోసా పథకం ద్వారా గురువారం రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బొమ్మల వెంకన్న, గొట్టం రవి, వెంకన్న, లక్ష్మన్, లక్ష్మన్, సురేష్, హరివర్మ, వీరబాబు, హమద్ ఉన్నారు.

ఉత్తమ్ దంపతులను విమర్శించే అర్హత లేదు

కోదాడరూరల్ : అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి దంపతులను విమర్శించే కనీస అర్హత మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు లేదని కాపుగల్లు మాజీ సర్పంచ్ తొండపు సతీష్, పీసీఎస్ చైర్మన్ నంబూరి సూర్యం అన్నారు. గురువారం మండలంలోని కాపుగల్లులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

ఆర్థికసాయం అందజేత

గరిడేపల్లి : మండలంలోని పానుగోడులో జోగు పిచ్చిరెడ్డి 37వ వర్ధంతి సందర్భంగా గ్రామంలోని నిరుపేదలు నందిపాటి వెంకటయ్య, భవాని, మేడిసినమెట్ల వెంకన్న కుటుంబాలకు గురువారం గ్రామ మాజీ సర్పంచ్ జోగు సరోజని ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కోశాధికారి జోగు అరవింద్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మేడిసినమెట్ల రాంబాబు, సైదిరెడ్డి, కుర్రి వెంకన్న, ముత్తయ్య, ఉపేందర్, కార్తీక్, సామ్రాట్, కిరణ్, పకీరా, షేక్ సాయి తదితరులు పాల్గొన్నారు.